పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి గ్రామం మోడల్ స్కూల్ విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలపై ఇల్లందకుంట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రూరల్ సీఐ సురేష్, ఇల్లందకుంట ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షలపై దృష్టి సారించాలని, మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ప్రేమవివాహాలు, తెలిసితెలియని వయస్సులో చేసే తప్పిదాలు, వాటివల్ల జరిగే నాష్టాలు వివరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ చారి, ఉపాధ్యాయబృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు

వీణవంక: విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో మనోధైర్యం కోల్పోవద్దని పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని ఎస్సై శేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల, ఇతర ప్రదేశాలలో ఇబ్బందులకు గురిచేస్తే ధైర్యంతో ఎదుర్కోవాలని, తల్లిదండ్రులు, టీచర్ల దృష్టికి తీసుకెళ్లాలని లేదా డయల్ 100కి సమాచారం ఇస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి సెల్‌ఫోన్ మోజులో పడి విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తులు బ్యాంకుకు సంబంధించి వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దని సూచించారు. ఆపదలో డయల్ 100, 1930 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అనంతరం షీ టీమ్స్ సేవలు, ట్రాఫిక్ నియమ నిబంధనల గూర్చి వివరించారు. కార్యక్రమంలో సీఐ రమేష్,ఎస్ఐ రాజన్న, కానిస్టేబుల్ అవినాశ్,హెచ్ఎం సత్యప్రసాద్ ఉన్నారు.

ఇల్లందకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీబీ వ్యాధిపై...

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యాధికారి తులసిదాస్ టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యల గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ దేవేందర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పీడీ సుజాత

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకేఎస్) కరీంనగర్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, జంక్‌ఫుడ్ వల్ల నష్టాలు అనే అంశంపై శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. మహ్మద్ అరాఫత్ ప్రథమ, మహ్మద్ రెహమాన్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ పీడీ సూజాత విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌వైకేఎస్ వలీంటీర్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు బహూకరణ


కుర్చీలు అందిస్తున్న దాతలు

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామ పరిధి మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు గ్రామానికి చెందిన తౌవుటు అజితేడ్డి సహకారం, రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పదివేల విలువైన కుర్చీలను సమకూర్చారు. శుక్రవారం రిటైర్డ్ ఉద్యోగి తౌటు కిషన్‌రెడ్డి, దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవా సమితి ప్రధాన కార్యదర్శి చిలుముల రమేశ్, జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల ప్రతినిధులు మహేశ్, నవీన్, అంగన్‌వాడీ టీచర్లు కనకలక్ష్మి, అంజలి పలువురు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రియాన్ష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నుంచి లక్ష రూపాయల ఎల్‌వోసీ మంజూరైంది. శుక్రవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చిన్నారి తండ్రి రాంచందర్‌కు ఎల్‌వోసీ అందజేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మచ్చ రమేశ్, తదితరులు పాల్గన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌డీ నాయకులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 27, 28వ తేదీల్లో మహాసభలు నిర్వహించనున్నామని, రచయితలు, మేధావులు, దళిత బాంధవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శనిగరపు ప్రశాంత్, నాయకులు కాశేశ్వరపు సాల్మన్, వడ్డెపల్లి శ్రీనివాస్, దొడ్డె రాజేంద్రప్రసాద్ ,అంబాల సమ్మయ్య, మైన విష్ణు, ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు కొత్త జయపాల్ రెడ్డి మిత్ర మండలి తరుపున సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన కనుకుంట్ల కళ్యాణి, బొల్లబత్తిని చక్రపాణి, బొల్లబత్తిని లక్ష్మీనారాయణ కుటుంబాలకు ఐదువేల చొప్పున శుక్రవారం సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచు, ఉపసర్పంచు కాసారపు శైలజ, శ్రీకాంత్, లాస్యరవి, బుర్ర అజయ్, బొల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల భారం తగ్గించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న యజమానులు

చొప్పదండి: పట్టణ ప్రజలపై పెంచిన ఇంటి పన్నుల భారం తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పన్నుల తగ్గింపు ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్‌కు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం వాణిజ్య గృహాలకు యూనిట్‌కు విధించిన ఒక్క రూపాయిని యూనిట్ ఒక్కంటికి ముప్పై పైసలకు తగ్గించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. నూతన చట్టాల గురించి తెలియని వారికి జీవితకాలపు ఫెనాల్టీలు విధించడం సమంజసం కాదని, వన్‌టైం ఫెనాల్టి విధించి యజమానులకు ఊరట కల్పించాలన్నారు. రైస్‌మిల్లులు, వాణిజ్య గృహాలకు ఖాళీ ప్రదేశంతో సహా పన్ను విధించడం సబబు కాదని, నిర్మాణం మేరకు పన్ను విధించాలన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థలోనే ఇంకా పన్నుల పెంపు అమలు చేయలేదని, చొప్పదండిలో పెంచడం అన్యాయమన్నారు. ఈ ఏడాది వసూలు చేసిన పన్నులను ముందు ఏడాదికి సర్దుబాటు చేయాలని, ఇంటి పన్నులను యూనిట్‌కు పదిహేను పైసల నుంచి పన్నెండు పైసలకు తగ్గించాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆరు నెలల పన్ను వసూలు చేస్తున్నారని, మరో ఆరు నెలల పన్ను, పెంచిన పన్నులను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి నివేదించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ఇసుక తవ్వకాలు ఆపాలని దీక్ష


రైతులతో మాట్లాడుతున్న ఎస్సై దాస సుధాకర్

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో రైతులు ఇసుక తవ్వకాలపై నిరాహార దీక్ష చేపట్టారు. శుక్రవారం మోయతుమ్మెద వాగు పక్కన టెంటు వేసి నిరసన తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి వాగులో ఇసుక తవ్వేందుకు జేసీబీ, టిప్పర్, లారీలు నవాబుపేట్‌కు రావడంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తవ్వకాలు చేపడితే భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. ఇసుక తవ్వకాలను ఆపాలని దీక్ష చేపట్టగా ఎస్సై దాస సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు దీక్ష భగ్నం చేసి రైతులు, గ్రామస్తులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీక్షలో పిల్లి తిరుపతి, ఠాకూర్ రణప్రతాప్, నరేందర్ సింగ్, బుర్ర శ్రీనివాస్, బోయిని వంశీకృష్ణ, ప్రశాంత్, మంద దేవేందర్ పలువురు ఉన్నారు.

పంట మార్పిడితో దిగుబడి


మాట్లాడుతున్న ఏవో రంజిత్‌కుమార్

చిగురుమామిడి: రైతులు పంట మార్పిడి విధానం అవలంబిస్తే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఏవో రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిగురుమామిడి రైతువేదికలో మండలంలోని 17 గ్రామాల రైతుబంధు కోఆర్డినేటర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. వానాకాలం, యాసంగి సీజన్‌లలో రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే రైతులు లాభాలు గడించే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో రైతు బంధు మండల కో ఆర్డినేటర్ పెనుకుల తిరుపతి, జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొంరయ్య, ఆయా గ్రామాల రైతుబంధు కోఆర్డినేటర్లు పన్యాల భూపతిరెడ్డి, తాడ శ్రీనివాస్‌రెడ్డి, పత్తేం రవీందర్, చీకోటి రమణయ్య, సిద్దెంకి రాయమల్లు, నర్రా రాజేశ్వర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

నేనున్నానంటూ..

- మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న వీణవంక సర్పంచ్


పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభిస్తున్న కౌశిక్‌రెడ్డి(ఫైల్)

వీణవంక: గ్రామంలో అనివార్య కారణాలతో ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు తనవంతుగా సహాయం చేస్తూ మానవత్వం చాటుకుంటున్నాడు వీణవంక సర్పంచ్ నీల కుమారస్వామి. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటివరకు వందకుపైగా మృతుల కుటుంబాలకు సాయం చేశారు. గ్రామ అభివృద్ధితో పాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పలువురి మన్ననలు అందుకుంటున్నాడు. మూడేళ్లలో 120 మంది చనిపోగా వారి ఇళ్లకువెళ్లి దహన సంస్కారాలకు సొంతంగా మూడువేలు అందించారు.

వీణవంక మండల కేంద్రం కావడంతో ఇతర గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. బస్టాండ్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ఏళ్లుగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా సొంతంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చాడు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముప్పై ఏళ్లుగా మండలంలో వారసంత నిర్వహించకపోవడంతో ప్రతి చిన్న వస్తువులకు పదిహేను కిలోమీటర్ల దూరంలోని జమ్మికుంటకు వెళ్లాల్సి వచ్చేంది. వీణవంకలోనే వారసంత కొనసాగేలా ప్రత్యేక చొరవ తీసుకుని ఇటీవల ప్రారంభించారు. ఇప్పుడు వారసంతకు విశేష స్పందన వస్తోంది. గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు తన వ్యవసాయబావి నుంచి ఉచితంగా నీరు సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు మంచినీటి సమస్య లేకుండా పోయింది. సర్పంచ్ సేవా కార్యక్రమలను ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి గుర్తించి ఇటీవల అభినందించారు.

అభివృద్ధే ధ్యేయం



గ్రామస్తుల సహకారం, పాలకవర్గం సమష్టి కృషితో అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం. ప్రయాణికులు ఇబ్బందులు పడొద్దని బస్టాండ్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాం. ప్రతి శుక్రవారం సంత జరిగే విధంగా ఏర్పాట్లు చేశాం. సంతకు మంచి స్పందన వచ్చింది. ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నారు. ఎవరైనా చనిపోతే తోచిన సాయం చేస్తున్నాను. రాబోయే రోజుల్లో మంచి కార్యక్రమాలు చేపడుతా.

– నీల కుమారస్వామి, సర్పంచ్, వీణవంక

కంటివెలుగు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

హుజూరాబాద్: పట్టణంలోని 12వ వార్డులో కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక ప్రారంభించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేసుకున్న లబ్ధిదారులకు కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, ఆరోగ్య శాఖ, మెప్మా సిబ్బంది ఉన్నారు.

లింగాపూర్‌లో వైఫై సేవలు..



మాట్లాడుతున్న బండ శ్రీనివాస్,తదితరులు

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్, మెట్‌పల్లి గ్రామాలలో శుక్రవారం వైఫై సేవలను ఎస్సీ కార్పోరేషన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. విద్య, ఉపాధి రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులకు సాధించేందుకు టీ వాణి సాంకేతిక నైపుణ్యం అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని దళితులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సీఎం కేసీఆర్ దళితబంధు పథకం ప్రవేశపెట్టారని, 4జీ మొబైల్ కవరేజీ లేని గ్రామాల్లో వైఫై పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సరోజన, వీరారెడ్డి, విడాట్ సీఈవో సంజీవ్‌కుమార్, సంస్థ డైరెక్టర్ శోభన్‌బాబు, సంజీవ్, రవీందర్‌రెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో రైతులు హైరానా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్రంలో అప్రకటిత కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని చెల్పూర్ గ్రామంలో నిర్వహించిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యుత్ కోతలతో రైతులు హైరానా పడుతున్నారన్నారు, కరెంట్ ఎప్పుడు వచ్చేది, పోయేది సెల్‌ఫోన్‌లో సమాచారం వచ్చే పరిస్థితి దాపరించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో కరెంట్ చార్జీలు రెండింతలు పెరిగాయని, ఏసీడీ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు పెరిగాయని, గ్రామాల్లో మద్యానికి బానిసై కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, కేసీఆర్ సర్కార్‌ను గద్దె దింపే సమయం దగ్గరపడిందని ఎద్దేవా చేశారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ ఎటు పోయిందని, ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇస్తామని చెప్పి రూ. 3 లక్షలు ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. హుజూరా బాద్ నియోజకవర్గ ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రతిక్షణం పోరా డుతానని తెలిపారు. సమావేశంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ప్రజల ఆకాంక్షతో ఏర్పడిన టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా పేరు మార్చుకుని ప్రజల విశ్వాసం కోల్పోయిందని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి విమర్శించారు. మండలంలోని కన్నాపూర్‌లో శుక్రవారం బీజేపీ స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో జైపాల్, సమ్మిరెడ్డి, నరేందర్, సంపత్, శ్రీకాంత్, సంపత్‌రెడ్డి, రమణారెడ్డి, వీరార్జున్, సమ్మిరెడ్డి, శివారెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

మానకొండూర్: దొంగతనం పేరుతో మెదక్ జిల్లాలో ఖాదీర్‌ఖాన్‌ను చిత్రహింసలకు గురిచేసి హత్యకు కారణమైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని మండల కేంద్రంలోని గడీమహల్ వద్ద బీఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం గురువారం నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కార్యకర్తలు బాలకిషన్, రాజు, ఆదిల్, సమీర సాజిద్ తదతరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ నాయకులు శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మెమోరాండం అందించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మాంకాలి తిరుపతి, పిట్ట మనోహర్, ఇరుగురాల రమేశ్, అరిఫ పవన్‌కళ్యాణ్, రోహిత్, ఉదయ్, మల్లేశం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

160 మినీ డెయిరీ యూనిట్లు మంజూరు

చొప్పదండి: చొప్పదండి మండలానికి పైలట్ ప్రాజెక్టు కింద 160 మినీ డెయిరీ యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీవో స్వరూప తెలిపారు. షెడ్యూల్ కులాలకు చెందిన యాభై ఏళ్లలోపువారికి యూనిట్లు అందిస్తామని చెప్పారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ద్వారా కుటుంబంలో ఒక్కరికి యూనిట్ మంజూరు చేస్తామని దరఖాస్తుదారుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల్లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులను సంబంధిత గ్రామ పంచాయతీల్లో సమర్పించాలని సూచించారు. గత ఐదేళ్లలో ఎటువంటి ఆర్థిక సహాయం పొంది ఉండనివారు సద్వినియోగం చేస్కువాలని కోరారు. యూనిట్ ధర రూ. 2 లక్షలు ఉంటుందని, రాయితీ రూ. 1.40 లక్షలు వర్తిస్తుందని, 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తామని, పంచాయతీ కార్యదర్శులు వారికి కేటాయించిన తేదీలో గ్రామసభ నిర్వహించి అభ్యర్థుల నుంచి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు స్వీకరించాలని కోరారు.

ఎండుతున్న పంటలకు నీరందించాలి

గంగాధర: ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించి ఎండుతున్న పంటలకు సాగునీరు అందించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నాయకులు, రైతులతో కలిసి మండలంలోని కొండాయిపల్లి గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. రెండు నెలలుగా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యాసంగి సాగు ప్రారంభానికి ముందే చెరువు గండ్లు పూడ్చివేతను అధికారులు పట్టించుకోలేదని, నిర్లక్ష్యం కారణంగా రిజర్వాయర్ కింద వేల ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణం నీటిని విడుదల చేయాలని, ఎండిన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, లేదంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. వెంట నాయకులు పురమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, బూర్గు గంగయ్య, తోట కరుణాకర్, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

హుజూరాబాద్: పట్టణంలోని తపాలా కార్యాలయం ఎదుట శుక్రవారం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉకంటి మహేందర్ మాట్లాడుతూ.. పోస్టల్ డైరెక్టరేట్ ఢిల్లీ కార్యాలయంలో పనిచేస్తున్న కింది స్థాయి ఉద్యోగులకు ఆచరణకు సాధ్యం కాని లక్ష్యాలను విధిస్తూ వేధింపులకు పాల్పడటం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో జీడీఎస్ రాష్ట్ర నాయకుడు నగేష్, గ్రూప్ సీ అధ్యక్షుడు ఇల్లందుల సమ్మయ్య, గ్రూప్ డీ కార్యదర్శి సంపతి, జీడీఎస్ అధ్యక్షులు ఎర్ర రాజు, నాయకులు అమర్నాథ్‌రెడ్డి, శారద, సునీల్, సురేష్, కృష్ణారెడ్డి, ప్రదీప్, గణేష్, స్వామి, సతీష్, శ్రీధర్ రెడ్డి, సంపత్ రాజయ్య తదితరులు ఉన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ


రామడుగు: మందులు వేస్తున్న అనిల్‌రెడ్డి

శంకరపట్నం: జీవాలకు నట్టల నివారణ మందు వేశామని పశువైద్యాధికారి మాధవరావు తెలిపారు. మండలంలోని కన్నాపూర్, మొలంగూర్, ఇప్పలపల్లి గ్రామాల్లో శుక్రవారం గొర్రెలు, మేకలకు మందులు వేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సంజీవరెడ్డి, అనూష, కేశవపట్నం పశువైద్యాధికారి భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి, పాపయ్యపల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి ప్లవన్ ముజుందార్ మాట్లాడుతూ.. రెండు గ్రామాల్లో 5,199 జీవాలకు మందులను పంపిణీ చేశామని, సీజనల్ వ్యాధులు, జీవాల సంరక్షణపై యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రామడుగు: జీవాలకు తప్పకుండా నట్టల నివారణ మందు వేయించాలని మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి కోరారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో పశువైద్య సిబ్బంది శుక్రవారం పశువులకు నట్టల నివారణ మందు తాగించే కార్యక్రమం నిర్వహించారు. 2,810 జీవాలకు నట్టల నివారణ మందు వేశామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఎడవెల్లి కరుణశ్రీపాపిరెడ్డి, సర్పంచ్ కర్ర సత్యప్రసన్న, లైవ్ స్టాక్ అధికారి గిరిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తొగరు భిక్షపతి తండ్రి మల్లయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు పరామర్శించారు. వెంట జెడ్పీ కో ఆప్షన్ నెంబర్ శుక్రుద్దీన్ తదితరులు ఉన్నారు.

- **వైభవంగా శంభుస్వామి జాతర**

చొప్పదండి: పట్టణ శివారులోని శివకేశవాలయం ఆవరణలో శుక్రవారం శంభుస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఏటా పాల్గుణ శుద్ధ పంచమి రోజు నిర్వహించే జాతరలో స్వామివారి దర్శనానికి ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ, వంశపారంపర్య అర్చకులు, వివేకానంద యూత్‌క్లబ్ సభ్యులు భక్తులకు ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేశారు. చొప్పదండి, రామడుగు, జూలపల్లి, ధర్మారం మండలాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఆలయ పరిసరాల్లో పెద్ద ఎత్తున దుకాణాలు వెలిశాయి. అర్చకుల ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వివేకానంద యూత్‌క్లబ్ అధ్యక్షుడు దూస రాములు జాతరను పురస్కరించుకొని ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

- **ఆలయ నిర్మాణానికి భూమిపూజ**


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వినీత

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో రజకుల ఆరాధ్య దైవం మడేలేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఎంపీపీ కొత్త వినీత భూమిపూజ చేశారు. శుక్రవారం రజకులనుద్దేశించి మాట్లాడారు. రజకులు ఐకమత్యంతో సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మమతశ్రీనివాస్, ఎస్సై దాస సుధాకర్, ఎంపీటీసీ రమేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్త కైలాసం, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు అంజయ్య, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, న్యాయవాది రాంబాబు, గ్రామ అధ్యక్షుడు వెంకటయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, యువజన సమితి అధ్యక్షుడు తిరుపతి పలువురు పాల్గొన్నారు.

- **రామేశ్వర ఆలయ నిర్మాణానికి...**

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామంలో శ్రీ రామేశ్వర ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజను అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల మధ్య కార్యక్రమాన్ని పూర్తి చేసిన అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ నిర్మాణ పనులు అరంభం నుంచి అడ్డంకుల మధ్య కొనసాగుతున్నాయి. ఎస్సై మామిడాల సురేందర్ బందోబస్తు నిర్వహించారు. చెరువుకు సంబంధించిన ప్రదేశంలో భూమిపూజ చేశారంటూ మళ్లీ రెవెన్యూ అధికారులు రంగ ప్రవేశం చేసి అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధిత ప్రదేశాన్ని జేసీపీతో పూడ్చివేయడం గమనార్హం. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మ్యాదారి శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి, సర్పంచ్ కుమ్మరి సంపత్, ఉప సర్పంచ్ పర్శ రాములు, సంతోష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.